క్లుప్తంగా

'బూదగవి'కి రూ.5.72 లక్షల ఆదాయం

ఉరవకొండ: బూదగవి సూర్యదేవాలయంలో నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ 5.77లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ అంగదాల కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల నుంచి రూ.3,70,990, రథసప్తమి టిక్కెట్ల ద్వారా 1,65,618, తాత్కాలిక హుండీ ద్వారా 3,37,740 మొత్తం 5,72,188 ఆదాయం సమకూరిందన్నారు. అలాగే 19 క్వింటాళ్ల బియ్యం, 250 కిలోల చక్కెర, 200 కేజీల బెల్లం, 250 కేజీలు రవ్వ, 4 డబ్బాల నూనె, 150 కిలోలు కందిబేడలు సమర్పించారని సర్పంచ్ లక్ష్మీదేవి, ధనంజయ తెలిపారు.

ఆర్ఎంఎం కమిటీ ఏకగ్రీవం

ఉరవకొండ: స్థానిక శాంతినగర్‌లోని రాయలసీమ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్(ఆర్ఎంఎం) ప్రాంతీయ కార్యాలయంలో ఆదివాకం రాయలసీమ జిల్లాల నూతన కమిటీ ఎంపికకు సమావేశం నిర్వహించారు. ఆర్ఎంఎం రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా విడపనకల్లు దావూద్‌సలాం, నియోజకవర్గ అధ్యక్షుడిగా పామిడి తయూబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జిలాన్, టౌన్ ఇన్‌చార్జ్ కె.జిలాన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పామిడి సలీం, అన్సర్ ఖలందర్‌సాబ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం కాలిపోయింది. నేమకల్లు గ్రామానికి చెందిన రైతు కురుబ రామకృష్ణ 10 ఎకరాల్లో సాగుచేసిన వరి గడ్డిని వామి వేసుకున్నాడు. మధ్యాహ్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు గడ్డివామిపై పడి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి స్థానికులతో కలసి మంటలను అదుపు చేశారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 60 వేల వరకూ నష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని హనిమరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో విరుపాపల్లికి చెందిన రామాంజినేయులు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి స్వగ్రామానికి వస్తుండగా హనిమరెడ్డిపల్లి వద్ద లారీ ఢీకొంది. ప్రమాదంలో అతడి కుడికాలు ఛిద్రం కావడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంతాపం

ఉరవకొండ: మాజీ మంత్రి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వట్టి వసంతకుమార్ మృతిపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రితో తనకున్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

నేడు వాహనాల వేలం

రాయదుర్గం: రాయదుర్గం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పీఎస్ పరిధిలో పట్టుబడిన పలు ద్విచక్ర వాహనాలను సోమవారం సెబ్ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తున్నట్టు రాయదుర్గం సెబ్ ఎస్ఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.5 వేలు ముందస్తుగా స్టేషన్‌లో చెల్లించి రసీదు పొందాలన్నారు.

కళ్యాణదుర్గం: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన పలు వాహనాలను సోమవారం కళ్యాణదుర్గం సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సెబ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లక్ష్మణ్‌దాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అధికారుల ఆదేశాల మేరకు వాహనాల వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

వేమన జయంత్యుత్సవాలు రేపు..

రాయదుర్గం: పట్టణ సమీపాన మద్దానేశ్వర కల్యాణమంటపంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వేమన జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్టు రెడ్డి సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు గౌని ఉపేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి సంఘం నాయకులతో కలసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న అధికారికంగా నిర్వహించ తలపెట్టినా.. రాయదుర్గం లో 31వ తేదీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రెడ్డి కుల బాంధవులతో పాటు అన్ని కుల సంఘం ప్రతినిధులు హాజరై వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ చేపట్టే ఏర్పాట్లను సంఘం నాయకులతో కలసి ఆయన పరిశీలించారు.

దశభుజ మహా గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం



ఈ ఫొటోలోని మహిళ పేరు లక్ష్మిదేవి. కుమారుడు మల్లికార్జునకు వివాహమైంది. వారికి వేర్వేరుగా రేషన్‌కార్డులున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆమెకు రూ.1.46లక్షలు, ఆమె కుమారుడి కుటుంబానికి రూ.79వేలు మొత్తం రూ.2.25 లక్షలు లబ్ధి చేకూరింది. ఎవరి సిఫారసు లేకుండా నేరుగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని తెలిపింది.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు పింజరి ఫాతిమా. ఏళంజి గ్రామం బొమ్మనహాళ్ మండలం. మూడున్నరేళ్లుగా వివిధ పథకాల కింద ఆమె కుటుంబానికి రూ. 3,36,526 జమయ్యాయి. జగనన్న విద్యాదీవెన రూ.10 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.3,107, వైఎస్సార్ రైతు భరోసా రూ. 54 వేలు, వైఎస్సార్ ఆసరా రూ. 5,400, వైఎస్సార్ చేయూత రూ. 56,250, జగనన్న విద్యా దీవెన రూ. 8,900. ఇంటి స్థలం రూ. 2 లక్షలు లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొంది.



కళ్యాణదుర్గం రూరల్: సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



బొమ్మనహాళ్: ఏలంజిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

- 'గడప గడప'లో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందాలంటే సీఎం జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, మహిళా రుణమాఫీ, పింఛన్లు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. ఇంత చేస్తున్నా టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వాటిని పట్టించుకోవద్దన్నారు. పొరపాటుగా వ్యవహరిస్తే ఇంటి వద్దకే పథకాలు అందించే పాలన కనుమరుగవుతున్నాందన్నారు. ప్రజలంతా ఆలోచించి జగనన్నకు మద్దతు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు నాగరత్న, ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బిక్కినా గలక్ష్మి, వైస్ ఎంపీపీ లింగమ్మ, కౌన్సిలర్ అర్చన, నాయకులు వేణుగోపాల్, మల్లికార్జున, గోవిందు, గోవిందరాజులు, దొణస్వామి, రవి పాల్గొన్నారు.

టీడీపీకి అధికారం ఎండమావే..

బొమ్మనహాళ్: ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అధికారం దక్కడం ఎండమావేనని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఏలంజి, కొత్తూరు, కానాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వా పింఛన్ అందిందా ? అక్కా వైఎస్సార్ చేయూత అందిందా ? ఆసరా ఆదుకుందా ? అంటూ అడిగి తెలుసుకున్నారు. విప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదలందరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిది అయితే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబును మళ్లీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పులిని చూసి నక్క వాతలు పెట్టకున్న చందంగా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలాబేగం, డీటీ భోగన్‌గౌడ్, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ తిమ్మక్క, ఎంపీటీసీ తిమ్మప్ప, నాయకులు యోగేశ్వరరెడ్డి, జయరామ్ రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వీరన్నగౌడ్, తిరుమలరెడ్డి, జగదీశ్వరరెడ్డి, తిప్పయ్య, లక్ష్మీనారాయణ, శీన, అనంతరాజు, బుజ్జి, అశోక్‌రెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అందించారు. విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన ఎర్రమ్మకు రూ.3 2వేలు, ఆమిద్యాల గ్రామానికి చెందిన నాగమ్మకు రూ.35 వేలు, ఉరవకొండ పట్టణానికి చెందిన గోవిందుకు రూ.15 వేల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం

రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ల పదవీ కాలన్నా రెండేళ్ల పాటు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కార్యాలయ ఆవరణలో సీఎం చిత్రపటానికి కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు కొడికి గోవిందు, జోగి వెంకటేష్, కురుబ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు వశికేరిరమేష్ క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్, పచ్చిరవి, జోగి భీమా, కమ్మటి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవం కావడంతో ఆదివారం బ్యాంకు అధ్యక్షుడు సాధు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షుడు చెంగల మహేష్, డైరెక్టర్లు ఎర్రిస్వామి, వెంకటస్వామి, వెంకటేష్ తదితరులు మాజీ ఎమ్మెల్యే విశ్వతో పాటు పార్టీ నాయకులు బ్యాంకు ఓబులేసు, బసవరాజును ఘనంగా సన్మానించారు.

దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం

రాయదుర్గంటౌన్: బాల సంస్కార కేంద్రాల ద్వారా విద్యార్థుల్లో సంస్కారం, దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడం గ్రామ వికాస్ ముఖ్య లక్ష్యమని ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ యుగంధర్, విభాగ్ గ్రామ వికాస్ ప్రముఖ్ సోమ నీలకంఠ అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గ్రామ వికాస్ అనంతపురం, రాయదుర్గం శాఖ ఆధ్వర్యంలో బాల సంగమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లోని 25 గ్రామాల్లో బాల సంస్కార కేంద్రాలున్నాయన్నారు. బాల సంగమానికి 15 గ్రామాల నుంచి గ్రామ వికాస్ టీచర్లు, గ్రామ వికాస్ కార్యకర్తలు పాల్గొనగా విద్యార్థులకు సామూహిక కోలాటం, అభినయ గేయం, భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు, అమృత వచనం, సుభాషితం, పద్యం, వ్యాయాయోగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి, బీహెచ్ఎంఎస్ వైద్యురాలు విజయలక్ష్మీ, మంజునాథ, రామన్న, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కళ్యాణదుర్గం: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



బెళుగుప్ప: ఉన్నత పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం: స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు చల్లా కిశోర్ చౌదరి, డాక్టర్ అశోక్, డాక్టర్ రాంబాబు, అమెరికా నుంచి వచ్చిన రాజశేఖర్, టీచర్ సతీష్, మారుతీ చౌదరి, రోజ్లీ రాజేష్, శంకర్ గౌడ్ నేతృత్వంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు నాగభూషణం, ఇందిరమ్మ, గౌరీ శంకర్‌ను ఘనంగా సత్కరించారు.

బెళుగుప్ప: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి , ఉపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారావు, కమలనాభుడు, దస్తగిరి, క్రిష్టయ్యను పూర్వ విద్యార్థులు దుశ్శాలువాలు పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. నాటి మధురస్మృతులను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిప్పేస్వామి, రమేష్, ఓంప్రకాశ్, ప్రవీణ్, రఘునాథరెడ్డి, మురళీ, మోహన్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్వతప్పస్వామి రథోత్సవం



ఉరవకొండ: రాయంపల్లిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



గుమ్మఘట్ట: ఊరేగుతున్న ఆంజనేయస్వామి

ఉరవకొండ: మండలంలోని రాయంపల్లిలో పర్వతప్పస్వామి రథోత్సవం శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం పర్వతప్పస్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. రాత్రి 2గంటల సమయంలో వీరభద్ర వేషధారణలో భక్తులు ఖడ్గాలు చెబుతూ నందికోలాటలతో పర్వతప్పస్వామి రథోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలపల్లకిలో ఊరేగిన ఆంజనేయస్వామి

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో ఆంజనేయస్వామిని ఆదివారం ముత్యాలపల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామిని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రథోత్సవం ముందు యువకులు నందికోళ్లతో ఉత్సాహంగా నృత్యం చేశారు. ఉత్సవాలను తిలకించడానికి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీపీ భవాని, మాజీ సర్పంచులు మునలరెడ్డి, తిమ్మప్ప, నాయకులు సుధాకర్‌రెడ్డి, హనుమప్ప, రామప్ప, సంజీవరెడ్డి, హనుమంతరెడ్డి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

21న మద్దానేశ్వర స్వామి రథోత్సవం

రాయదుర్గం రూరల్: మండలంలోని మద్దానేశ్వర స్వామి రథోత్సవం ఫిబ్రవరి 21న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. రథోత్సవ ఏర్పాట్ల గురించి ఆదివారం స్థానిక ఆలయంలో ఆదివారం చర్చించారు. ఆయన మాట్లాడుతూ పశువుల జాతర సందర్భంగా ఫిబ్రవరి 9న బండిమోటు వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే మార్చి 1న ముత్యాల పల్లకోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుపోటీలు

కణేకల్లు: మాల్యం గ్రామంలో సుంకులమ్మదేవి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో రైతు కురుబ చంద్ర ఎద్దులు మొదటిస్థానంలో నిలవడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మర్రెగౌడ మొదటి బహుమతిగా రూ.5వేల నగదును అందజేశారు. బాషా అనే రైతుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈయనకు నరేష్ రూ.3 వేల నగదును అందజేశారు. రైతు బసవరాజుకు మూడో బహుమతిగా వెయ్యి రూపాయలను నాగేంద్ర అందజేశారు. కార్యక్రమంలో సుంకులమ్మదేవి ఆలయ నిర్వాహకులు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాటిల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉరవకొండ: స్థానిక కణేకల్లు రోడ్డులో నూతనంగా నిర్మించబోయే భువనేశ్వరీ అమ్మవారి దేవస్థానం శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పూర్ణకుంభంతో మాజీ ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్ గవ్వల సోమశేఖర్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, అశోక్, నీలూరి రత్న, డొంకారి మంజుల, నాగభూషణం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం

కణేకల్లు: కణేకల్లు క్రాస్, ఆలూరులో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు కె.కొత్తపల్లిలో 'గడప గడపకూ' కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లిలో సోమవారం ఉదయం 9గంటలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తారని ఆయన తెలిపారు.

పనులు నాణ్యతగా చేయండి

కళ్యాణదుర్గం రూరల్: వాటర్‌షెడ్ పనులను నాణ్యతగా చేపట్టాలని అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బోరంపల్లిలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రాతిచప్పళ్ళ పనులు ఎన్ని చేపట్టారు? ఏఏ స్థాయిలో పనులు జరుగుతున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఇతర పనులను కూడా ప్రారంభించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓలు శ్రీవిద్య, రాజు, టీఏ శేషు, కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

వజ్రకరూరు: వజ్రకరూరు-విడపనకల్లు మధ్య చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆర్ అండ్‌బి జేఈ కావ్య పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు పూర్తయితే మండలంలోని పొట్టిపాడు, చాబాల, ధర్మపురి, జనార్దనపల్లి తదితర గ్రామాలకు రహదారి సమస్య పరిష్కారం కానుంది.

నేడు 'స్పందన'

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్జీదారులు దరఖాస్తుతోపాటు ఆధార్ జిరాక్సు జతపరచాలన్నారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

గృహసారథుల నియామకం

శెట్టూరు: మండలంలోని యాటకల్లు సచివాలయంలో పరిధిలో 40 మంది వైఎస్సార్‌సీపీ గృహ సారథులను నియమించినట్టు సచివాలయ కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు ఆదివారం తెలిపారు. చిన్నంపల్లిలో 22 మంది, బచ్చేహళ్లిలో 32 మంది, కైరేవు(1)లో 18 మంది, కైరేవు(2)లో 48 మంది, లక్ష్మంపల్లిలో 36 మందిని నియమించామన్నారు. సోమవారం మిగిలిన గ్రామాల్లో గృహసారథులను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్‌లు విరుపాక్షి ఈరన్న, సత్యనారయణ రెడ్డి, వన్నూరుస్వామి, ప్రకాష్, విరుపాక్షి గౌడు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు

ఉరవకొండ: పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో ఆదివారం 15వ వార్డు సభ్యుడు వశికేరి మల్లికార్జున 30 వీధి లైట్లు ఏర్పాటు చేయించారు. కాలనీవాసులు ఆయనను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరరానికి స్పందన

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆయతపల్లిలో ఆదివారం ఉచితగుండె వైద్య శిబిరం నిర్వహించినట్లు వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి అన్నారు. సవీరా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మొత్తం 130 మందికి గుండె, కిడ్నీ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్‌నాయక్ , గ్రామపెద్దలు మల్లారెడ్డి, కులశేఖర్, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి , చాకలి శీన, గోపాల్ రెడ్డి, జయణ్ణ, పెద్దింటి రామాంజినేయులు పాల్గొన్నారు.

శుద్ధ జలం అందించండి

కూడేరు: శుద్ధ జలాన్ని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎంపీపీ నారాయణ రెడ్డి సీపీడబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ సిబ్బందికి సూచించారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాం వద్ద సీపీడబ్ల్యూఎస్ ప్రాజెక్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నీటి శుద్ధిచేసే విధానాన్ని పరిశీలించారు. నీటి సమస్య తలెత్తకుండా ప్రాజెక్ట్ పరిధిలోని సుమారు 25 గ్రామాలకు నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మంజునాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు బైరెడ్డి రామచంద్రా రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

కుందుర్పి: ఆర్డీటీ పర్యవేక్షణలో జంబుగుంపల పంచాయతీలోని ఐదు గ్రామాల్లో వాటర్‌షెడ్ ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆ సంస్థ ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వరెడ్డి తెలిపారు. సుమారు రూ.13కోట్ల వ్యయంతో నీటికుంటలు, ఫారంపాండ్లు, పాడిపరిశ్రమ, పండ్లతోటల పెంపకం, భూ అభివృద్ధి పనులు, నాళాల్లో పూడిక తీత పనులు చేపడతామన్నారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.ఆదివారం కెంచంపల్లి గ్రామంలో సిబ్బందితో కలసి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రామాంజనేయులు, ఎకాలజీ కోఆర్డినేటర్ హనుమంతరాయుడు, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్ఐ సుమన్ తెలిపారు. పట్టణంలోని వినాయకసర్కిల్‌లో ఆదివారం నాకాబందీ నిర్వహిస్తుండగా కారులో 96 హేవర్డ్స్ టెట్రా ప్యాకెట్లను గుర్తించామన్నారు. నిందితుడు కణేకల్లు మండలం బోయ వంశీని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కారు సీజ్ చేశామన్నారు.

మానవత్వం చాటుకున్న 'కామక్కపల్లి'



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం



మంచానికి పరిమితమైన బాధితురాలు శారద

కళ్యాణదుర్గం రూరల్: కళ్లెదుట ప్రమాదం జరిగినా చూసీచూడనట్లు వెళ్లిపోయే కాలమిది. ఆపదలో ఉనప్పుడు ఆర్థిక సాయం కోరితే మొహం చాటేసే రోజులివి. ఇలాంటి తరుణంలో ఓ పేద మహిళ రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకోవడంతో గ్రామానికి చెందిన ధనికులు, రైతులు, కూలీలు అనే తేడా లేకుండా మానవత్వంతో స్పందించి లక్షలాది రూపాయలు ఆర్థిక సాయం అందించారు. బాధిత మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి కామక్కపల్లి ఆదర్శంగా నిలిచింది. గ్రామస్తులతో పాటు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం ప్రకటించగా సిబ్బంది బాధిత కుటుంబానికి సాయమందించారు. వివరాలు.. మండలంలోని కామక్కపల్లిలో శారద 2022 నవంబర్ 27న రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బాధిత మహిళ ఎడమకాలు ఛిద్రమైంది. శారద, ఆమె భర్త ఆనంద్‌లు వివిధ రకాల పంటల కాయలు కోయడానికి రోజూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. కూతురు దీక్షిత 6వ తరగతి, కుమారుడు దర్శన్ 2వ తరగతి చదువుతున్నారు. ఇలాంటి తరుణంలో శారద ప్రమాదానికి గురై మూలన పడడంతో ఆ కుటుంబానికి తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. ఈ తరుణంలో గ్రామస్తులు మానవత్వంతో స్పందించారు. గ్రామానికి చెందిన ఓ టమాటా వ్యాపారి రూ.50 వేలు, మరో రైతు రూ.10 వేలు, ఇంకో రైతు రూ.10 వేలు, శారదతో పాటు కూలి పనులకు వెళ్లే నాగరత్న, ప్రభావతి, నాగమ్మ, లక్ష్మక్క, అంజినమ్మ, రత్నమ్మ తదితరులు రూ.500 నుంచి రూ.1000ల దాకా సాయం అందించి ఆదుకున్నారు. ఇలా అందరూ సహాయం చేయడానికి ముందుకు రావడంతో సుమారు రూ.1.80లక్షలు వైద్యం ఖర్చులకు సహాయం జమైంది. ఆ గ్రామస్తులను ఇతర గ్రామస్తులు అభినందిస్తున్నారు.

తిరుపతి రుయా ఆస్పత్రిలో వైద్యం

బాధిత శారదకు మెరుగైన వైద్యం అవసరమని ఇక్కడి వైద్యులు చెప్పడంతో తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అక్కడే సుమారు 54 రోజులు పాటు ఉండి వైద్యం చేయించుకుని వచ్చారు. అక్కడ బయట మందులు అవసరం ఏర్పడడంతో రూ.2 లక్షలు ఖర్చు చేశారు. 25 రోజుల తరువాత మరో ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని అక్కడి డాక్టర్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.